క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



పెదకాకాని: ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. మండలంలోని వెనిగండ్ల గ్రామంలో గురువారం సుమారు రూ.35 లక్షల వ్యయంతో నిర్మించనున్న వాటర్ సంప్, కుమ్మరికుంట చుట్టూ వాకింగ్ ట్రాక్, సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో గత 25 ఏళ్లుగా జరగని అభివృద్ధి పనులు నాలుగున్నర ఏళ్లలో చేసి చూపిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న పనులు త్వరితంగా పూర్తి చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచనలు చేశారు. ఎంపీపీ తుల్లి మిల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ బివి మల్లేశ్వరరావు, ఉప సర్పంచి కొండమడుగుల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



పి.శ్రీనివాసరావు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి, అధ్యాపకుడికి ఉజ్వల భవిష్యత్తు కల్పించటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పి.శ్రీనివాసరావుకు వీఐటీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. యాన్ ఆప్టికల్ మల్టీ ఆబ్జెక్టివ్ మెటీరియలైజ్డ్ వ్యూ సెలక్షన్ యూజింగ్ ఎన్సెంబుల్ కాన్సెప్టింగ్ హ్యాండ్లింగ్ అండ్ హైబ్రిడ్ ఆప్టిమైజేషన్స్ అనే అంశంపై ప్రొఫెసర్ ఎ.రామసతీష్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. అధ్యాపకుడు శ్రీనివాసరావును కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏట డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంపీపీ చంద్రశేఖర్ రావు తదితరులు అభినందించారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి



ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని పుల్లడిగుంట సర్పంచ్ షేక్ పర్వీన్ సుల్తానా అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో గురువారం ఎస్సీ కాలనీలో సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పర్వీన్ సుల్తానా మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కాలనీ వాసులకు సైడు కాలువలు నిర్మిస్తున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు సాధారణ నిధులను వెచ్చించి సుమారు రూ. 6 లక్షలతో సైడ్ కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఉపసర్పంచ్ నేజీబాయ్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఏలేశ్వర శివప్రసాద్, నాయకులు శంకర్, సయ్యద్ సుభాని, సయ్యద్ బాషా, సయ్యద్ నన్నేసా పాల్గొన్నారు.

రేపు రాజశ్యామల మహా యజ్ఞం



పాత గుంటూరు: ఏటుకూరు బైపాస్ రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో శనివారం భద్రకాళీ పీఠాధీశ్వరి సింధు మాతాజీ ఆధ్వర్యంలో రాజ్య శ్యామల మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు భవతారిణి ట్రస్ట్ సభ్యులు లంకదాసు ప్రసాదరావు తెలిపారు. బ్రాడీపేటలోని హోటల్లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహా యజ్ఞం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. 10న ఉదయం 4గంటలకు గోపూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రాత్రి 9 గంటల వరకు విశేష పారాయణాలు, కుంకుమార్చనలు, మంత్రపుష్పం, మహా పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి మాతాజీ ఆశీర్వచనం, ప్రసంగం, అతిథిలకు, ప్రముఖులకు అవార్డు ప్రదానోత్సవాలు ఉంటాయని వివరించారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో తల్లం శేఖర్, తల్లం సత్యనారాయణ, చెరుకూరి శ్రీనివాసరావు, పులిపాటి రాజేంద్రప్రసాద్, గోపాలకృష్ణ శ్రేష్టి పాల్గొన్నారు.

పంచాయతీలకు కాసుల కళ



ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం

- గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల
- నియోజకవర్గంలోని పంచాయతీలకు సుమారు రూ. 3 కోట్లు
- పలు అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణకు అవకాశం

ప్రత్తిపాడు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామ పంచాయతీలకు ఆర్థిక దన్నును కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరురూరల్, వట్టిచెరుకూరు మండలాల్లో 77 గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా పంచాయతీలకుగాను జనాభా ప్రాతిపదికన రూ. 2,94,21,589లు విడుదలయ్యాయి. ఈ నిధులతో గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనతో పాటు సిబ్బంది జీతభత్యాలు, బిల్లుల చెల్లింపులు వంటివి పంచాయతీ పాలకవర్గాలు నిర్వహించుకోవచ్చు.

ఏమేం పనులకు వినియోగించుకోవచ్చు

- బేసిక్ గ్రాంటుతో రోడ్లు, సైడు కాల్వల నిర్మాణాలు
- పంచాయతీ భవనాల నిర్మాణాలు.. మరమ్మతులు
- వీధిదీపాల నిర్వహణ
- సీసీ ఛార్జీల బకాయిల చెల్లింపులు
- టైడ్ గ్రాంటుతో పారిశుద్ధ్య నిర్వహణ
- క్లాప్ మిత్ర వేతనాలు
- తాగునీటి సరఫరా నిర్వహణకు..
- ఎంబుక్ చేసిన బిల్లుల చెల్లింపులు
- సిబ్బంది జీతభత్యాలు

15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు..

మండలం	పంచాయతీలు	15వ ఆర్థిక సంఘం నిధులు(రూ.)
ప్రత్తిపాడు	16	58,04,802
గుంటూరురూరల్	9	30,51,350
పెదనందిపాడు	17	50,42,786
కాకుమాను	18	1,03,58,724
వట్టిచెరుకూరు	17	51,63,927
మొత్తం	77	2,94,21,589

మౌలిక వసతుల కల్పనకు వినియోగించుకోవచ్చు



గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. వచ్చిన నిధుల్లో అరవై శాతం తాగునీటికి, పారిశుద్ధ్యానికి ఖర్చు చేయాలి. మిగిలిన నిధులతో నిబంధనలను అనుసరించి రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు ఇతరత్రా బిల్లుల చెల్లింపులు చేసుకోవచ్చు. నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలి.

– కె.శ్రీదేవి, డీపీఓ, గుంటూరు డివిజన్

నగరంలో కలుషిత నీరు సరఫరా జరిగే ప్రసక్తే లేదు

- నగరపాలక సంస్థ ఎస్ఈ సుందరరామిరెడ్డి
- వార్త పత్రికలో వచ్చిన కథనం పూర్తిగా అవాస్తవం



సంగడిగుంటలో తాగునీటి శాంపిల్ సేకరిస్తున్న మెడికల్, నగరపాలక సంస్థ అధికారులు

నెహ్రూనగర్: నగరంలో కలుషితనీరు సరఫరా జరిగే ప్రసక్తే లేదని, నగరపాలసంస్థ పరిధిలోని రిజర్వాయర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నట్లు ఎస్ఈ సుందరరామిరెడ్డి తెలియజేశారు. కలుషిత నీరు తాగి డయేరియాతో ఒకరు మృతి చెందినట్లు ఓ వార్త పత్రికలో వచ్చిన కథనం పూర్తిగా అవాస్తమని ఖండించారు. సంగడిగుంట తిరుమల చారి కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం ఇంజినీరింగ్ అధికారులు, మెడికల్ ల్యాబ్ ఫీల్డ్ ఆఫీసర్ శివ కుమార్ ఆధ్వర్యంలో తాగునీటి శాంపిల్స్ సేకరించారు. ప్రాథమికంగా తాగునీటిలో క్లోరిన్ తగుపాళల్లో ఉందని, నీరు కలుషితం కాలేదని ధ్రువీకరించారు. సంగడిగుంటకు తాగునీటి సరఫరా చేసే బీఆర్ స్టేడియం రిజర్వాయర్ సమీపంలో పైపుల మరమ్మతుల్ని పది రోజుల కిందట పూర్తి చేసినట్లు ఎస్ఈ తెలిపారు. కలుషిత నీరు సరఫరాకి, పైపు లైను మరమ్మత్తులకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. బీఆర్ స్టేడియం రిజర్వాయర్ని ఈనెల ఆరో తేదీన శుభ్రం చేసినట్లు చెప్పారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్

వైఎస్. విమలారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న విమలారెడ్డి

పాత గుంటూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి సోదరి వై.ఎస్. విమలారెడ్డి అన్నారు. తూర్పు నియోజకవర్గం పొన్నూరు రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాలులో గురువారం దైవ సేవకులు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్.విమలారెడ్డి, వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విమలారెడ్డి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరువవుతున్న తీరు చూస్తుంటే రానున్న ఎన్నికల్లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు, పాస్టర్లు పాల్గొన్నారు.

గుండె రోగులకు అండగా ‘బజరంగ్’

- సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితోనే సేవాకార్యక్రమాలు
- బజరంగ్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



యాంజియోగ్రామ్ పరీక్షలు చేయించుకున్న నంబూరు గ్రామస్తులు

పెదకాకాని: మండలంలోని నంబూరు గ్రామంలో ఈనెల 4, 5వ తేదీలలో బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమం ద్వారా జరిగిన మీ గుండె పదిలం శిబిరంలో గుండె సంబంధిత వైద్య శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన 45 మందిని గుర్తించారు. వారిలో రెండవ విడతగా 10 మందిని చికిత్స నిమిత్తం ప్రత్యేక బస్సులో విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా గురువారం బజరంగ్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ యాంజియోగ్రామ్‌కు హాజరైన రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్షల్లో 9 మంది ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉండగా ఒకరికి బైపాస్ సర్జరీ అవసరమున్నట్లు వైద్యులు గుర్తించడం జరిగిందన్నారు. బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తూ వేగవంతంగా సకాలంలో వైద్య సహాయం అందేందుకు తోడ్పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని మరిన్ని గ్రామాలకు తీసుకువెళతానన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ ఉయ్యూరు సతీష్‌రెడ్డి, బజరంగ్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మునిపల్లెలో కళ్లజోళ్ల పంపిణీ

కొరిటెపాడు(గుంటూరు): పొన్నూరు మండలం మునిపల్లె గ్రామంలో జనవరి 31వ తేదీన బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమంలో భాగంగా నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరం ద్వారా కళ్లజోళ్లు అవసరమైన 355 మందికి పంపిణీకి సిద్ధం చేశామని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వెల్లడించారు. మునిపల్లెలో శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని చెప్పారు. గ్రామస్తులంతా అందుబాటులో ఉండి కళ్లజోళ్లు పొందాలని అంబటి మురళీకృష్ణ కోరారు.

మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్న సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టాభిపురంలో నివాసం ఉండే ఓ మహిళ ఫొటోల్ని వ్యక్తి మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్నాడు. గుర్తించిన మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య ..

వృద్ధుడి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారానికి చెందిన వెంకటరమణారెడ్డి (72) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళ...

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతీనగర్‌కు చెందిన మల్లెల అలేఖ్య (30) వ్యక్తిగత కారణాలతో మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు తెలగాయపాలెంలో గడప గడపకు..

కాకుమాను: మండలంలోని తెలగాయపాలెంలో శుక్రవారం గుండె గుండెకు జగనన్న.. గడప గడపకు కిరణన్న కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ చింతల రాహేలమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్ది మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో మండలంలోని పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ వైద్యం అందించి ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని అంకిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి తెలిపారు. గురువారం 26వ డివిజన్ సీఆర్ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అర్హులైనవారికి మందులు, కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

గుంటూరు మెడికల్: జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 10న ‘విభజన చట్టం –ఆంధ్రప్రదేశ్ రైల్వే ప్రాజెక్టులు’ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి అవధానుల హరి గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్, పలు పార్టీల నాయకులు, పలు రంగాల నిపుణులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

లక్ష్మీపురం: రెడ్డిపాలెం, నంబూరు రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపాలెం – నంబూరు రైల్వే స్టేషన్ పరిధిలో సుమారు 45 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల విచారించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా నిర్ధారించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడు వివరాలు తెలిసిన వారు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు 9440627546, ఎస్ఐ జి.వెంకటాద్రి 7207076614 నంబర్లను సంప్రదించాలి.

ఆశ్రమానికి బ్యాంక్ ఆఫ్ బరోడా వితరణ



కొరిటెపాడు (గుంటూరు): కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా నగరంపాలెం బ్రాంచి గురువారం పాత గుంటూరులోని శ్రీ ఆర్.ఆర్. మూర్తి వృద్ధుల ఆశ్రమానికి గురువారం 50 కుర్చీలు, 75 దుప్పట్లు, వృద్ధులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ నరేష్ పంగ మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని వెల్లడించారు. వృద్ధుల్ని ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో బల్లిపల్లి వెంకటేశ్వరరావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వాకింగ్‌ట్రాక్ పనులు వేగవంతం చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలించి సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్

పెదకాకాని: గ్రామంలో ఎంపీ నిధులతో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పెదకాకాని గ్రామంలో రాజ్యసభ సభ్యులు ఎంపీ ల్యాడ్స్‌తో నిర్మిస్తున్న ఆళ్ల దశరథరామిరెడ్డి వాకింగ్ ట్రాక్‌ను గురువారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సీపీఓ శేషశ్రీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెదకాకానిలో 25 ఎకరాల మంచి నీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఎంపీ నిధుల నుంచి రూ. 40 లక్షలు కేటాయించారన్నారు. అదేవిధంగా రూ.30 లక్షలు గైడ్ వాల్, ఫెన్సింగ్, పెయింటింగ్ పనులకు కేటాయించడం జరిగిందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ చెరువు కట్టను పటిష్టపరచి గైడ్ వాల్‌ను నిర్మించడం జరిగిందని జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. మరో రూ.16 లక్షల పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, ఏఈ శివరామకృష్ణ, పెదకాకాని తహసీల్దార్ పెల్లూరి రత్నం, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి



యూనియన్ అధ్యక్షుడు ఉస్మాన్‌ను సత్కరించిన కమిటీ సభ్యులు

పొన్నూరు: ఆటోనగర్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని టీబీసీ రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో సభ్యులు షేక్ రహంతుల్లా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉస్మాన్ రెండో పర్యాయం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఉస్మాన్‌ను ఘనంగా సత్కరించారు. సభ్యులు షేక్ బుడే, సయ్యద్ బాబు, షేక్ కాలేషా, జిలాని, ప్రతాప్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకారంలో ఏకశిలా నందీశ్వర విగ్రహం

చేబ్రోలు: చేబ్రోలులో ప్రఖ్యాతి గాంచిన నందీశ్వర విగ్రహానికి బుధవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. బహుళ పుష్య త్రయోదశిని పురస్కరించుకొని చేబ్రోలులో ఏకశిలా విగ్రహంతో నిర్మించిన ఎర్రరాతి నందీశ్వర విగ్రహానికి అర్చకులు సత్యనారాయణ శర్మ, మారుతీవరప్రసాద్‌ల ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక నాగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం మాస శివరాత్రి ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక అలంకారంలో నాగేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

ఓటర్ల దరఖాస్తులపై అప్రమత్తత అవసరం

అదనపు కమిషనర్ కె. రాజ్యలక్ష్మి



సూపర్వైజరీ ఆఫీసర్స్, బీఎల్‌ఓలతో సమావేశమైన అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: ఓటర్ల ముసాయిదా జాబితా (డ్రాఫ్ట్ రోల్) అనంతరం అందిన దరఖాస్తుల్ని బూత్ లెవల్ అధికారులు(బీఎల్ఓ) అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో కె.రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు గురువారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో తూర్పు నియోజకవర్గ బీఎల్ఓలు, సూపర్వైజరీ అధికారులతో ఎన్నికల ఓటర్ల తుది జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం తుది జాబితా అనంతరం కూడా అనేక రకాల దరఖాస్తులు అందుతున్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. అనంతరం సూపర్వైజరీ అధికారులు సంతకం చేసి తదుపరి అనుమతుల కోసం ఏఈఆర్వోకి పంపాలని స్పష్టం చేశారు. ప్రధానంగా నూతన ఓట్ల చేర్పులు, తొలగింపు దరఖాస్తులు సూపర్వైజరీ అధికారులు, ఏఈఆర్వోలు నేరుగా పరిశీలించాలని ఆమె ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల్ని పరిశీలించి, అవసరమైన వాటి కోసం ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని బీఎల్ఓలకు చెప్పారు.పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై బాధ్యత తీసుకోవాలని సూపర్వైజరీ అధికారులకు ఆమె సూచించారు. సమావేశంలో ఏఈఆర్వోలు డి.వెంకటలక్ష్మి, ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ, డెప్యూటీ తహసీల్దార్లు బి.భాస్కర్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న జీజీహెచ్ అధికారులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ జి.ఆశా తెలిపారు. ఇటీవల ఆసుపత్రి రైల్వే స్టేషన్ గోడ వద్ద పరిశుభ్రంగా ఉంచాల్సిందిగా నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో గురువారం నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ జి.ఆశా ఆసుపత్రిని పరిశీలించారు. అధ్వానంగా ఉన్న ఆ ప్రాంతాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సిబ్బందికి ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో నెలకున్న వాతావరణాన్ని డాక్టర్ సతీష్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ ఆమెకు వివరించారు. రెండు, మూడు రోజుల్లో ఆసుపత్రి గోడకు ఆనుకొని ఉన్న ప్రాంతాన్ని పూర్తిగా పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని ఆశా తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ, నర్సింగ్ సూపెరింటెండెంట్లు కె. ఆశా సజని, గంగమ్మ, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలి



ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, సుబ్బారావును సన్మానిస్తున్న హెచ్‌ఎం అసోసియేషన్ ప్రతినిధులు, ఉర్దూ డీఐ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన లింగేశ్వరరెడ్డిని కలిసిన హెచ్‌ఎంలు ఆయనతో పాటు ఇప్పటి వరకు ఆర్జేడీగా పని చేసి బదిలీ అయిన వీఎస్ సుబ్బారావును సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల లబ్ధిని విద్యార్థులకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆర్జేడీని కలిసిన వారిలో హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏ. తిరుమలేష్, గౌరవాధ్యక్షుడు జె.సురేష్‌కుమార్, నాయకులు గుత్తా శ్రీనివాసరావు, సీజే మణికుమార్, ఎన్వీ నాగమణి, కె. వీరాస్వామి, టి. శ్రీధర్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం ఉన్నారు.